గుడిసెవాసులకు జనగణన అవకాశం కల్పించాలి : సీపీఐ

దశ, పెద్ద అంబర్‌పేట్ : కుంట్లూరు గ్రామ రెవెన్యూ పరిధిలో భూదాన భూముల్లో నివాసముంటున్న గుడిసెవాసులకు జనాభా గణనలో అవకాశం కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సంపత్ కుమార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకులు ఆందోజ్ రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి, మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్ మాట్లాడుతూ, గత నాలుగేళ్లుగా కుంట్లూరు భూదాన భూముల్లో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న నిరుపేదలకు భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణనలో తమ వివరాలు నమోదు చేసుకునే హక్కు కల్పించాలని కోరారు. అడ్రస్ ప్రూఫ్ లేదనే కారణంతో వారిని జనగణన నుంచి దూరం చేయడం సరికాదన్నారు. అవకాశం కల్పించకపోతే కారణాలను రాతపూర్వకంగా తెలియజేయాలని, అవసరమైతే వేలాది మందితో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ అంశంపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ సంపత్ తెలిపారు అని నాయకులు పేర్కొన్నారు.

పెద్ద అంబర్‌పేట్‌లో ఘనంగా వనమహోత్సవం

దశ, పెద్ద అంబర్‌పేట్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పెద్ద అంబర్‌పేట్ వార్డులో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ కమిషనర్ ఏ. సంపత్ కుమార్ హాజరై మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "పర్యావరణ పరిరక్షణ మన అందరి సామాజిక బాధ్యత. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలి" అని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూబీడీ డిప్యూటీ మేనేజర్ ఆర్. శ్రీనివాస్‌తో పాటు కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వనమహోత్సవం సందర్భంగా వార్డులో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటడం జరిగింది.

కోహెడలో సీఎం సభకు భారీగా తరలిరావాలి

❖ పండుగుల రాజు

దశ, పెద్ద అంబర్ పేట : కోహెడ ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమానికి శనివారం హాజరుకానున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు 52వ డివిజన్ అధ్యక్షుడు పండుగుల రాజు పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి అధ్యక్షతన శనివారం సాయంత్రం 5 గంటలకు కోహెడ ఫ్రూట్ మార్కెట్ వద్ద జరిగే ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

❖ ఆడబిడ్డలే లబ్ధిదారులుగా పట్టాలు
❖ రాష్ట్ర రెవిన్యూ, గృహ, నిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

దశ, హైదరాబాద్ ప్రతినిధి: డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో (CURE) క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై హౌసింగ్ సెక్రెటరీ వి.పి. గౌతమ్ గారు మరియు సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించడం జరిగింది. తెలంగాణ ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల సొంతింటి కలను సాకారం చేసే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం దేశ చరిత్రలోనే చిరస్థాయిగా మిగిలిపోతుంది. గతంలో ఏ ప్రభుత్వం చేయని సాహసం చేస్తూ పేదల అభ్యున్నతి కోసం ఇందిరమ్మ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. హైదరాబాదు లాంటి మహా నగరంలో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. అంతేకాదు ఆ ఇంటి స్థలానికి ఆడబిడ్డలను యజమానిగా చేస్తూ వారి పేరు మీదనే పట్టాను అందించనుంది. మహిళలకు సొంతింటిపై హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు వారి సాధికారతకు బలమైన పునాది అవుతుంది. క్యూర్ పరిధిలో నివాసముంటున్న ప్రాంతాలకు సమీపంలోనే పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాల్లో అల్పాదాయ (LIG), మధ్యతరగతి వర్గాలు (MIG) ప్రజలకు త్వరలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వబోతున్నాం. 202627 ఆర్థిక సంవత్సరానికి క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లకు ఇతర ప్రాంతాలల్లో 2.50 లక్షలు మొత్తం 3.50 లక్షల ఇండ్లకు ఇప్పటికే పరిపాలన పరమైన అనుమతులు ఇవ్వడం జరిగింది. పేదల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇండ్ల డిజైన్ లను రూపొందించాలి. ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండేలా ప్లాన్ చేయాలని అధికారులకు సూచించడం జరిగింది.

మండలంలో ప్రీ ప్రైమరీ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

దశ, అబ్దుల్లాపూర్‌మెట్: విద్యా సంవత్సరం 202627కు సంబంధించి అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా పీఎస్ కోహెడ, కుంట్లూర్, పెద్ద అంబర్‌పేట్, రాగన్నగూడ, బాటసింగారం, తట్టి అన్నారం, పసుమాముల పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన ఇన్‌స్ట్రక్టర్ (టీచర్), ఆయా పోస్టులకు స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 6 నుంచి 10వ తేదీ వరకు జెడ్పీహెచ్ఎస్ అబ్దుల్లాపూర్‌మెట్ పాఠశాలలో దరఖాస్తులు సమర్పించవచ్చు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్ అర్హతతో పాటు ప్రైమరీ టీచర్ ట్రైనింగ్/డీఈడీ చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయా పోస్టుకు 7వ తరగతి విద్యార్హతగా నిర్ణయించారు. ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు ₹8,000, ఆయాకు ₹6,000 గౌరవ వేతనం అందించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని అధికారులు వెల్లడించారు.

కోహెడలో సీఎం సభకు భారీ ఏర్పాట్లు

❖ వేలాదిగా తరలిరావాలని కాంగ్రెస్ శ్రేణులకు జైపాల్ రెడ్డి పిలుపు

దశ, రంగారెడ్డి : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో నేడు జరగనున్న అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరుకానున్న ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి అధ్యక్షత వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రైతుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే ప్రాజెక్టుగా కోహెడ ఫ్రూట్ మార్కెట్ నిలవనుందని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, సీఎం సభ ఏర్పాట్ల పర్యవేక్షణకు వచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డిలను కొత్తపల్లి జైపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సభ ఏర్పాట్లపై నాయకులు అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. కోహెడ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణంతో రైతులకు అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్ సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

కోహెడలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన, భారీ ట్రాఫిక్ ఆంక్షలు

దశ, హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జూన్ 6న కోహెడ వద్ద నిర్వహించనున్న ప్రపంచ స్థాయి ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు విస్తృత ట్రాఫిక్ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు హాజరుకానుండటంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. భొంగ్లూర్ క్రాస్ రోడ్డు, పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు, సంఘీ గ్రామం వైపు నుంచి వచ్చే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించనున్నట్లు తెలిపారు. వాహనదారులు ముందస్తుగా తమ ప్రయాణ ప్రణాళికలు సిద్ధం చేసుకుని ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని సూచించారు. సభకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తల కోసం ఆరు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.

ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, మీడియా ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సాధారణ ప్రజల వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. వేల సంఖ్యలో బస్సులు, కార్లు నిలిపేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, సభకు వచ్చే ఆటో, టాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు కూడా వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేయరాదని, మీటర్ లేదా నిర్ణీత చార్జీల ప్రకారమే సేవలు అందించాలని హెచ్చరించారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సభకు వచ్చే ప్రజలు కూడా ప్రయాణానికి ముందు చార్జీలను నిర్ధారించుకోవాలని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమం విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, వాహనదారులు, డ్రైవర్లు సహకరించాలని వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

❖ మొక్కలు నాటిన మెజిస్ట్రేట్ కంబపు సూరిరెడ్డి

దశ, మణుగూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో మణుగూరు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో జడ్జి కంబపు సూరి రెడ్డి శుక్రవారం మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని పరి రక్షించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధమైన బాధ్యత జడ్జి కంబపు సూరి రెడ్డి పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 51A (g) ప్రకారం ప్రతి పౌరుడు, ప్రకృతి, అడవులు, నదులు, సరస్సులు, వన్యప్రాలను, సంరక్షించి అభివృద్ధి చేయాల్సిన ప్రాథమిక విధి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది వీరంకి పద్మావతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుకృష్ణ, జనరల్ సెక్రటరీ మధుసూదన్, న్యాయవాదులు కందిమల్ల నరసింహారావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, గద్దల సాంబ, వాసవి, కోర్టు సిబ్బంది రవికుమార్, అటవీశాఖ అధికారులైన డిఎఫ్ఓ బాబు, రేంజర్ ఉపేందర్, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనమే భావితరాలకు భద్రమైన భవిష్యత్

మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

దశ, నల్గొండ : నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా మిర్యాలగూడ రోడ్డులోని NAC స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మార్గదర్శకత్వంలో హరిత నల్గొండ లక్ష్యంగా నగరవ్యాప్తంగా మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర మాట్లాడుతూ ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇబ్రహీం మొహమ్మద్, డీఈఈ పి. అశోక్, ఏఈ అసీం బాబా, శానిటరీ సూపర్వైజర్ జి. శ్రీనివాస్, వార్డు అధికారి సి.హెచ్. శృతి, హరితహారం, పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

SIRపై అందరూ జాగ్రత్తలు తీసుకోవాలి

❖ బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్

దశ, భద్రాచలం: భారత ఎన్నికల సంఘం చేపట్టనున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (SIR Special Intensive Revision) పై అవగాహన కల్పించేందుకు దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాలలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, BLA1 కుంజా సంతోష్ శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొని బూత్ స్థాయి ఏజెంట్లకు (BLA2) దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కుంజా సంతోష్ మాట్లాడుతూ ఎన్నికల్లో సరైన ఓటర్ల జాబితా ఎంతో కీలకమని, SIR ప్రక్రియను ప్రతి బూత్ స్థాయిలో విజయవంతం చేయాల్సిన బాధ్యత BLAలు, బూత్ అధ్యక్షులు మరియు పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంటింటి ధృవీకరణ చేపట్టి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని సూచించారు. పార్టీ తరఫున అందుబాటులో ఉన్న 2002 ఓటర్ల జాబితాను రిఫరెన్స్‌గా వినియోగిస్తూ క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుంజా ధర్మారావు, బీజేపీ మండల ఇంచార్జీ గూనూరి రమణ, బీజేపీ మండల అధ్యక్షులు త్రినాథ్ రెడ్డి, బూత్ అధ్యక్షులు, శక్తికేంద్ర ఇంచార్జిలు, BLAలు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

NMMS స్కాలర్‌షిప్‌కు ZPSS పినపాక విద్యార్థిని ఎంపిక

దశ, పినపాక: పినపాక మండలంలోని జడ్పీహెచ్ఎస్ పినపాక పాఠశాలకు చెందిన విద్యార్థి కోణా ప్రతీకా చౌదరి జాతీయ ఆదాయ ఆధారిత ప్రతిభా ఉపకార వేతన పథకం స్కాలర్‌షిప్‌కు ఎంపిక అయింది .ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. ప్రభుత్వ పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు.విద్యార్థి 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతి సంవత్సరం రూ.12,000 చొప్పున స్కాలర్‌షిప్ పొందేందుకు అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి తెలిపారు. విద్యార్థిని సాధించిన ఈ విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

❖ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

దశ, కొత్తగూడెం: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) కృష్ణ గౌడ్‌ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి, పూల బొకే అందజేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా ఒక పూల మొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ అనేది ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో అటవీ శాఖ అధికారులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం మాజీ సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, సారపాక సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇంగువ రమేష్, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

దశ, కొత్తగూడెం: అశ్వాపురం మండల కేంద్రంలో ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, R&B అధికారులు అర్ధరాత్రి అంబేద్కర్ విగ్రహాన్ని జేసీబీతో ఇష్టం వచ్చినట్లు తీసి, చెత్త కుప్పలో పడేసారని ఆవేదన వ్యక్తం చేశారు. దానికి నిరసనగా అప్పటి నుండి వివిధ రకాల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం భద్రాద్రి జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్‌కి తగిన గౌరవం దక్కేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందుల కృష్ణార్జున్, గద్దల నాగేశ్వరరావు, భూక్యా చందులాల్, గద్దల రామకృష్ణ, చెట్టి సురేష్, మేకల భాస్కర్, గద్దల భాను, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాదిగల్లో అక్షరాస్యతను పెంచడం కోసం పల్లె పల్లె పోదాం

❖ ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి మొలకలపల్లి రవి

దశ, మణుగూరు: మణుగూరు మండలం విజయనగరంలో గోటు విలేజ్ ప్రోగ్రాం లో భాగంగా కొమ్ము హుస్సేన్ మాదిగ ఆధ్వర్యంలో జిల్లా ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల విస్తృత సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి ములకలపల్లి రవి మాదిగ మాట్లాడుతూ.. మాదిగ సామాజిక వర్గంలో డ్రాప్స్ అవుట్స్‌ని తగ్గించి, విద్యా అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా మార్గ నిర్దేశం చేసి అక్షరాస్యతను పెంపొందించడం కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నేటి నుండి జులై 5 వరకు గో టు విలేజ్ ప్రోగ్రాం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో MRPS మణుగూరు మండలం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకవెళ్లాలి

❖ సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె

దశ, అశ్వారావుపేట: అశ్వారావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్లు గ్రామ పంచాయతీ కోఆర్డినేటర్లు స్పోషల్ మీడియా ప్రతినిధులతో దమ్మపేట మండలం పట్వారిగూడెం గ్రామంలో చెలికాని ఆదెమ్మ ఫంక్షన్ హాల్ నందు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ & ట్రాన్స్పోర్ట్ అథారిటీ కమిటి మెంబర్ పెట్టం నవీన్, సోషల్ మీడియా స్టేట్ సెక్రటరీ & కర్మాన్ఘాట్ హనుమాన్ టెంపుల్ డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, మహబూబాబాద్ కౌన్సిలర్ అంబాల శివకుమార్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ వీరాపురం రామలక్ష్మణ్ హాజరై పార్టీ బలోపేతానికి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించిన రోజువారీ స్థానిక అంశాలు ప్రజా సమస్యలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి పనులను ప్రజలకు సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా చేరవేయాలని సూచించారు అలాగే పీసీసీ ఏఐసీసీ కార్యక్రమాలు స్థానిక నాయకుల పర్యటనలు ప్రజా సమావేశాలు పార్టీ కార్యకలాపాలను ప్రజలకు చేరేలా రీల్స్ వీడియోలు గ్రాఫిక్స్ ల ద్వారా ప్రజల అభిప్రాయాలతో కూడిన కంటెంట్‌ను నిరంతరం రూపొందించి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.

వాట్సాప్ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడంలో భాగంగా మండలాల వారీగా బూత్ స్థాయిలో కమ్యూనికేషన్ గ్రూపులను ఏర్పాటు చేసి ప్రతిరోజూ పార్టీ సమాచారాన్ని క్రమబద్ధంగా ప్రజలకు చేరవేయాలని సూచించారు ప్రతి సందేశం వాస్తవాల ఆధారంగా ఉండాలని విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు తప్పుడు ప్రచారాలు దుష్ప్రచారాలను వెంటనే గుర్తించి వాస్తవ నిర్ధారణ చేసి ప్రజలకు సరైన సమాచారం అందించాలని నాయకులు సూచించారు.

ముఖ్యమైన అంశాలపై వెంటనే ఉన్నత స్థాయి నాయకత్వానికి సమాచారం అందించే విధానాన్ని పాటించాలని తెలిపారు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు అలాగే సోషల్ మీడియా ప్రతినిధులకు ప్రభావవంతమైన పోస్టుల తయారీ వీడియో ఎడిటింగ్ గ్రాఫిక్ డిజైన్ సోషల్ మీడియా చేరిక పెంపు కృత్రిమ మేధస్సు (AI) ఆధారిత కంటెంట్ తయారీ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు రాబోయే 30 రోజులలో అశ్వారావుపేట నియోజకవర్గ సోషల్ మీడియా నెట్‌వర్క్‌ను విస్తరించడం మండల మరియు బూత్ స్థాయి బృందాలను మరింత బలోపేతం చేయడం సోషల్ మీడియా ఫాలోవర్ల సంఖ్య మరియు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం ప్రతిరోజూ కంటెంట్ పోస్టింగ్ మరియు నివేదికల సమర్పణను కచ్చితంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు ప్రజాసమస్యల పరిష్కారం ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించాలని నాయకులు పిలుపునిచ్చారు సోషల్ మీడియాకు సంబంధించిన అధికారిక అన్ని వెబ్సైట్లను సమర్థవంతంగా నిర్వహించాలని కోఆర్డినేటర్లకు సూచించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఐదు మండలాల అధ్యక్షులు మహిళా అధ్యక్షులు సర్పంచులు ప్రజాప్రతినిధులు అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

స్మశాన వాటిక నందు తాత్కాలిక సౌకర్యాలు కల్పించాలి

దశ, మధిర: అభివృద్ధి పేరుతో శివాలయం వద్ద గత 100 సంవత్సరాల నుండి ఉన్నటువంటి స్మశాన వాటిక నందు తాత్కాలిక ఏర్పాట్లు చేయకుండా చనిపోయిన కుటుంబ సభ్యులను మనోవేద కు గురి చేస్తున్న మధిర మున్సిపల్ కార్యవర్గమన్నారు. ఈ స్మశాన వాటిక నందు అభివృద్ధి పేరుతో తాత్కాలిక సౌకర్యాలు కల్పించకుండా చనిపోయిన వారి పార్థివ దేహాలను దహనం చేసుకునే తాత్కాలిక ఏర్పాటు చేయకుండా ముందస్తు ప్రణాళిక లేకుండా దహన ప్రాంతం యొక్క కట్టడములను అడ్డగోలుగా తొలగించినారు. కాబట్టి సదరు స్మశానవాటిక నందు తాత్కాలికంగా దహన సంస్కారాలు చేసుకోవడానికి సౌకర్యాలు కల్పించాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మధిర మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వారు మాట్లాడుతూ.. కొంతమంది తమ సాంప్రదాయం ప్రకారం చనిపోయిన వారిని సమాధి చేస్తారు ప్రస్తుతం ఉన్న సమాధులను తొలగించి ఎక్కడ దూరంగా ఉన్న ప్రదేశానికి వెళ్ళమని చెప్పటం భావ్యం కాదు ఇప్పుడు ఉన్న ప్రదేశంలోనే ఒక పక్కకు సమాధులకు స్థలాన్ని కేటాయించాలని బి ఆర్ ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. ప్రజల సాంప్రదాయాలతో వారి మనోభావాలతో ఆడుకోవద్దని పై సౌకర్యాలు కల్పించాలని మధిర టిఆర్ఎస్ పార్టీ మధిర మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చినది. ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో బిఆర్ఎస్ నాయకులు బిక్కి కృష్ణ ప్రసాద్ మొండితోక జయాకర్ కౌన్సిలర్ వైవి అప్పారావు పల్లపోతు వెంకటేశ్వరరావు, అరిగే శ్రీనివాసరావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, రాఘవరావు, భువనగిరి నారాయణరావు, చారు గుండ్ల నరసింహమూర్తి, కోన జగదీష్, మిరియాల సీతారామయ్య, చక్రం పరిష, శ్రీనివాసరావు, అబ్దుల్ కురేషి తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

- BRS పార్టీ యూత్ నాయకులు

దశ, మణుగూరు: మణుగూరు మున్సిపాలిటీ కార్యాలయం నందు మున్సిపాలిటీ కమిషనర్ నాగ ప్రసాద్ కలిసి రానున్న వర్షాకాలం నేపథ్యంలో మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని డ్రైనేజీ వ్యవస్థ పూకూడికతీకి పనులు పట్టణంలోని ప్రధాన వాగు అయినటువంటి కట్టు వాగు పూడిక తీత పనులు లోతట్టు ప్రాంతాలైన సుందరయ్య నగర్ ఆదర్శనగర్ గాంధీ నగర్ ప్రాంతాలలో ముందు జాగ్రత్త చర్యలు వెంటనే చేపట్టాలని BRS పార్టీ యూత్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలాజీ నగర్ కాళీమాత ఏరియా ప్రాంతాలలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచి సైడ్ కాలువ పూడికతీసి పూర్తిగా శుభ్రపరచాలని మరియు వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా డెంగు, మలేరియా, విష జ్వరాలు వంటి అంటు వ్యాధులు ప్రబలకుండా నిరంతరం ఫాగింగ్ చేయాలని పట్టణంలోని అన్ని వీధులలో బ్లీచింగ్ మరియు శానిటేషన్ పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలని ప్రజలు వినియోగించే బావులు మరియు నూతులలో బ్లీచింగ్ పౌడర్ క్రమం తప్పకుండా వేయించి నీటిని శుద్ధి చేయాలని కమిషనర్‌కి వినతిపత్రం అందజేశారు. మణుగూరు మండల BRS పార్టీ యువజన విభాగం అధ్యక్షులు బోశెట్టి రవిప్రసాద్ యువజన నాయకులు జక్కం రంజిత్, ఆవుల శ్రీను, మారోజు రమేష్, గుంటక ఏశాన్, తాళ్లపల్లి నాగరాజు, BRS సోషల్ మీడియా అధ్యక్షులు డేగల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

❖ భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

దశ, కొత్తగూడెం: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చుంచుపల్లి మండలం రుద్రంపూర్ వి.కే.సి.ఏం ప్రాంతంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా అటవీ అధికారి కృష్ణ గౌడ్ తదితరులు కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేకూర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత: జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్

దశ, కొత్తగూడెం: జిల్లా కొత్తగూడెం కేంద్రంలో స్టేషన్ ఆఫీసర్స్, కోర్టు డ్యూటీ ఆఫీసర్స్‌తో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు డ్యూటీ అధికారులకు కేసులు పట్ల పూర్తి అవగాహన స్టేషన్ ఆఫీసర్ కల్పించాలని జిల్లా ఎస్పీ సూచించారు. బాధితులకు న్యాయం జరిగే విధంగా సమగ్రంగా కేసులను పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. సమ్మన్స్ వారెంట్లు జారీలో జాతీయం లేకుండా సకాలంలో సాక్షులకు మరియు నిందితులకు అందజేయాలని తెలిపారు. కోర్టులో విచారణ నడిచే సమయంలో సాక్షులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూసుకోవాలని, సాక్షులకు కేసు వివరాలు పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. కేసులకు సంబంధించిన సీజ్ చేసిన ప్రాపర్టీని ఎప్పటికప్పుడు కోర్టులో హాజరు పరచాలన్నారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు తమ అధికారులకు తెలియజేస్తూ బాధ్యతాయంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. నేరస్థులకు శిక్ష పడేవిధంగా కేసులు పరిష్కారంలో కృషి చేస్తూ బాధితులకు న్యాయం చేకూర్చడం ప్రతి ఒక్కరు బాధ్యతని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో గల సీఐలు, ఎస్ఐలు, పలు హోదాల్లో ఉన్న పోలీసులు పాల్గొన్నారు.

పాలక వర్గ ప్రజావ్యతిరేఖ నిర్ణయాలపై ఉద్యమాలకు శ్రీకారం

❖ మాజీ MP, CPM సీనియర్ నాయకులు మిడియం బాబురావు

దశ, భద్రాచలం: పాలకవర్గ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని CPM సీనియర్ నాయకులు భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబురావు పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో శుక్రవారం జరుగుతున్న CPM రాజకీయ శిక్షణా తరగతుల్లో CPM పార్టీ సీనియర్ నాయకులు, భద్రాచలం మాజీ MP మిడియం బాబురావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పేద ప్రజలకు న్యాయం జరిగే విధంగా ప్రజా పోరాటాలు నిర్వహించాలని చెప్పారు. పేదవాడికి ఎర్రజెండానే అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ప్రస్తుత పాలకవర్గాలు ప్రజలకు న్యాయం చేయలేక పోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజల పక్షాన సీపీఎం పార్టీ అండగా నిలబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.